వనకన్య

ఊరవతల ఎడం ఎడంగా నాలుగైదు పూరిగుడిసెలూ, గొల్ల పాకలూ, పాటవతల పడిపోయిన మట్టిగోడా, దానవతల రావి చెట్లూ, వార్ధక్యంతో వొంగిపోతూ వున్న చింతచెట్టూ అక్కడనుండి ప్రారంభ మవుతుంది. బొటనవ్రేలి ఆకారంలో వొందగజాల వైశాల్యంగల నిరుపయోగమైన స్థలం. ఆ స్థలం అంత మేరా, అయిష్టంగా ఎదిగే సర్వి చెట్లు, నడుమ పాడుబడ్డబావి. అక్కడికి మనుషులూ వెళ్ళరు. పశువులూ వెళ్ళవు. ఎప్పుడన్నా మందనుండి తప్పించుకున్న ఏ మేకన్నా కంచి మెయ్యడానికి వొస్తుందేమో; ఏకాంతాన్ని అన్వేషిస్తూ సోమరితనాన్ని ఋజువు చేసుకోడానికి ఏ గాడిదన్నా వెడుతుందేమో, దట్టంగా ఎదిగిన ముళ్ళపొదలూ, పాకి పాకి నేలని చీల్చి పైకి తేలిన చెట్ల వేళ్ళూ రక్త మాంసాలను పోగొట్టుకున్న ఆకుల కళేబరాలూ, బావిచుట్టూ పెనవేసుకున్న పూలమొక్కలు, మ్రానులు, దయ్యాలు శ్వాస తీస్తున్నట్లు ధ్వనించే సర్విచెట్లు, మట్టిలో దూసుకుపోయిన రంగురంగుల గుడ్డపీలికలూ, ముళ్ళు, నాచు, మట్టి, దుప్పలు, శిథిలాలైన రాళ్ళ గుట్టలు, సూర్యచంద్రులు భయంతో తొంగిచూసే ఆ ప్రాంతంలో భూతాలు కాపురం వుండొచ్చునేమో అనిపిస్తుంది. మనుషులుండటానికి వీలుకాదు.

అక్కడికో మనిషొచ్చాడు ఆ సాయంత్రం. కోటువిప్పి అదీ ఎగిరి పోకుండా రాయిపెట్టి, చొక్కా చేతులు మడిచి, ఆకుల మధ్యగా నడవడం

మొదలెట్టాడు. సూర్యుడు ఆకాశం అంచు చివర దిగిపోయి తన వునికి తెలియజేస్తూ, ఆవేశంలో ఇంత పసుపు కుంకుమ వెదజల్లి వెళ్ళాడు. కొమ్మలనడుమ గబ్బిలాలు బైటపడడానికి సంశయిస్తూ వింతధ్వనులు చేస్తున్నాయి. చీకటి తరుముకొస్తూ వుంది. కీచురాళ్ళు మట్టిపురుగులు తీతువులు గొంతులు సవరించుకుంటున్నాయి.

నడుంగా ఆ దుప్పలు పొదలు విడిపోయిన చెట్లకొమ్మలు చీపురు పొద ఆ మధ్య ఖాళీ ఏమిటో శోధించడానికి ఆ వ్యక్తి ముందుకు నడిచాడు. అది పాడుబడ్డ బావి. వెడల్పుగా వుంది. లోపలంతా చీకటి. నలుపు గోడలు. అంచులు కనబడ్డంలేదు. లోపలి వారలచుట్టు పొదలు ఎదగడం మానేసిన చెట్లకొమ్మలు చీపురు కాడల దుప్పలా కమ్మివేశాయి. వాటిమధ్య తీక్షణంగా చూస్తే లోపల పచ్చటి నీరు. ఏవేవో ఆకులు—ఆ కదిలేది తాబేలుపిల్ల జడుసుకున్నట్లు అడుగు వెనక్కి వేశాడు. ఏవో కొన్ని ఆకులనూ, వ్రేళ్ళనూ తుంచి కాగితంలో కట్టి కోటుజేబులో కుక్కుతున్నాడు. చీకటి దట్టమైంది. గబ్బిలం తెగించి బైటపడింది. గుడ్లగూబ ప్రేయసిని పలకరిస్తోంది. రకరకాల ధ్వనులు—అతను పోల్చలేడు. ఆకులు రెపరెపలు—అడుగుల చప్పుడు కోటు దులిపి తొడుక్కుంటున్నాడు. ఆ సర్వీచెట్టు వెనక ఎవరో వొకామె నిలబడి వుంది. చివాలున అటు తిరిగింది గడ్డిలో కూర్చుంది.

ఎవరామె? ఇక్కడికెందుకొచ్చిందో? అతను ఆశ్చర్యపడ్డాడు. తనెందుకొచ్చినట్లు?—అవును, ఆకు, అలము, వేరు మాను - వింత వింత రకాలని ఇంటికి తీసుకెళ్ళి, ద్రావకాలు పోసి, మాడ్చి వాటి లక్షణాలు పరిశీలించి, దేనికన్నా మందుగా ఉపయోగపడతాయేమో కనుక్కోవాలి—అతని పేరు సుదర్శనం—డాక్టరు దగ్గర కాంపౌండరు. డాక్టర్ చదివింది ఇంగ్లీషు వైద్యమే అయినా, బీదలకి "నేటివ్" మందులు వాడుతుంటాడు. రోజూ వో గంట సుదర్శనం ఆకులూ, వేళ్ళూ పోగుచేసి పరిశోధించ

డానికి అనుమతిచ్చి, ప్రోత్సహిస్తాడు. ఏ ప్రాంతంలో వున్న ఓషధులు ఆ ప్రాంతం రోగులకు మందులుగా ఉపకరిస్తాయని ఆయనకో నమ్మకం.

సుదర్శనం కోటు తొడుక్కుని వెళ్ళడానికి సిద్ధపడుతున్నాడు. ఆమె వొంటిగా వెళ్ళగలదా? ఆమెని దిగవిడిచి వెళ్ళడం మంచిదా ? అనుకుంటుండంగానే ఆమె లేచి, వెడుతోంది "అమ్మయ్య" అనుకున్నాడు. ఆమె దూరంగా వెళ్ళాక అతనూ ఇంటికి బైలుదేరాడు. అతని వయస్సు పాతిక, కాలేజీలో చదువు పూర్తవ్వకుండానే; కుటుంబ పరిస్థితుల వొత్తిడి వల్ల కాంపౌండరుగా కుదిరిపోయ్యాడు. ఆ వొచ్చినామె అక్కడికెందుకొచ్చిందో ఊహించలేకపోయ్యాడు.

* * *

ఆ మర్నాడు మళ్ళీ అక్కడికి చేరుకున్నాడు కాస్తంత పెందరాళే, ఆకులు వేళ్ళు ఏరడం మొదలెట్టాడు. అతనికి ఆ మొక్కలపేర్లు తెలియవు. కొత్తగా కనబడిన ఆకులల్లా పోగు చేస్తున్నాడు. సాయంత్రం ఐదు దాటింది; ఆరైంది; సూర్యుడు చెట్ల వెనుక ఎర్రశాలువలాంటి వెలుగుని ఆకాశంలో విప్పి పారేసి; కిందికి దిగుతున్నాడు. ఆ చెట్టువెనుకే నిన్న వొచ్చినామె కూర్చుంది. అక్కడి గడ్డిని పరీక్షగా చూశాడు. అక్కడ ఏ పూలమొక్కలూ లేవు.

ఏదన్నా వొస్తువు పాతడానికొచ్చిందా ? పాతినదాన్ని త్రవ్వి తీసుకెళ్ళడానికొచ్చిందా? లేదు. ఆకాశంలో ఎఱుపు నలుపుగా కరుగుతోంది. గబ్బిలం రెక్కలు విప్పుతోంది, కీటకాలు సన్నగా రొద సాగిస్తున్నాయి. కాసేపు గడ్డిలో కూర్చున్నాడు. ముళ్ళుగా తగిలినవాటిని అటూ ఇటూ త్రోసివేసి ప్రకృతి దిగులుగా వున్నా, అతని మనస్సు ప్రశాంతంగా వున్నట్టనిపించింది. ఆ నిర్జన ప్రదేశం తనది అని అనుకోడంలో ఆనందం వుంది. దూరంగా; నిన్న తాను కూర్చున్న గుట్ట దగ్గరకొచ్చింది, ఆమె—నిన్న వొచ్చినామె అతన్ని చూసింది. కంగారుపడి వెనక్కి తిరిగి వెళ్ళబో

తూంది. పలకరిస్తేనేం? ఆ ఊళ్ళో ఆమెని ఎక్కడో, ఎప్పుడో; చూసి వట్లుంది. చిన్నామె; ఇరవై లోపేమో. వాడిన మందార లాంటి వెలుగులో ఆమె కళ్ళు మెరిసినట్టనిపించింది. వైఖరి; వాలకం చూస్తే, బీదకుటుంబంలో పిల్లలాగుంది. అదేమిటి అల్లా వెళ్ళిపోతూంది? వెళ్ళిపోయింది. గొడ్లపాకలు దాటి— ఇంకా దూరంగా వెళ్ళిపోయింది.

కొమ్మలపై తమ జాగాలపై హక్కులు చలాయిస్తూ పిట్టలు; అటూ ఇటూ ఎగిరి పోటీలు పడుతున్నాయి. కీచురాళ్ళ రొద ప్రారంభమైంది. ఆకాశంలో అక్కడక్కడ నక్షత్రాలు— అటుకేసి ఆకులనడుమ చందమామ. సన్నటిగాలి మొదలెట్టింది. గాలి, చంద్రుడు, నక్షత్రాలు కాస్తంత ధైర్యాన్నిచ్చినా వొక భావం మెదడులో రేగి! భయంతో క్షణం గగుర్పాటు చెందాడు. ఊరవతల నిర్జనప్రదేశం—పాడుబడ్డ బావి—అట్లాంటిచోట దయ్యాలు తిరుగాడతాయంటారు. ఆ వొచ్చినామె అలాంటి స్వరూపమా? తొందరగా లేచి వెళ్ళాడు సుదర్శనం. ఆ రాత్రల్లా ఆమెని గురించిన ఆలోచనలే. ఆమె ముఖాన్ని మరిచిపోలేకుండా వున్నాడు. ఆ పెద్దకళ్ళతో తన కనురెప్పల వెనుక చూసినట్టవుతోంది. భూతం అందంగా వుంటుందా? బీదదయ్యం అంటూ వుంటుందా? నల్లదుస్తులు ధరించాలి కాని, ఆకుపచ్చ రంగు చీర కట్టుకుందా? ఆమె రవిక రంగేమిటో అతను గమనించలేదు. ఎవర్నైనా అడిగి తన సందేహాలు తీర్చుకోవాలి. నిద్ర పట్టేసింది.

* * *

మరి నాలుగురోజులు అటుకేసి వెళ్ళలేదు సుదర్శనం. ఆమెని గురించి ఎవర్నీ అడగలేదు. అంతగా ఆలోచించే అవసరమూ కనబడలేదు. తనదంతా భ్రమ. ఆమె ఆ ఊళ్ళో మనిషే—ఏదో పనిమీద అటు వెడుతూ అక్కడికి వొచ్చి వుంటుంది.— తనని చూడగానే సిగ్గుపడో, భయపడో వెళ్ళిపోయింది. గొడ్లపాకకేసి వెళ్ళడం తను చూడనే చూశాడు దయ్యంలేదు. గియ్యంలేదు అనుకున్నాడు.

సుదర్శనానికి వివాహం కాలేదు. ఆమె మొహంలో ఏదో వుంది. ఆ క్షణం చూపుతోనూ ఆమె తనని ఆకర్షించిందని ఒప్పుకోక తప్పడం లేదు. ఆమెని దగ్గరగా పరీక్షగాచూస్తే ఎలా వుంటుందో ఊహించుకోడంలో ఆనందం లేకపోలేదు. ఏదో రోజు అక్కడికి వెళ్ళాలనుకున్నాడు, ఆమె మళ్ళా అక్కడికి వొస్తుందనిగాదు. ఆ నూతిలోపల వరల రెండువైపులా ఎన్నెన్నో మొక్కలు, సగం సగం లేచిన పొద, చెట్ల కొమ్మలూ మొలిచి వున్నాయి. అందులో కొన్నింటిని పోగుచెయ్యాలి. కాని దిగడం ఎట్లా? ఎంత లోతుందో తెలియదు. పూరిపాకలు దాటాక గొడ్లపాకల దగ్గర కొచ్చాడు. అది చివరిపాక. అక్కడ ఎవ్వరూ లేరు— దిబ్బేసిన గడ్డి వామిలో భాగం తప్ప. అక్కడ పశువులుకూడా లేవు. కాని పాకలో తడి కలకి తగిలించిన నిచ్చెన కనబడుతోంది. మధ్యలో మెట్లు కర్రలు లేవు. చాలాచోట్ల తాళ్ళతో మెలితిప్పి నిచ్చెన గట్లున్నాయి.

పాకలోకెళ్ళి అటూ ఇటూ చూశాడు. ఎవ్వరూ లేరు. సూర్యుడు దిగిపోవడానికి సంసిద్ధుడవుతూ, వీడ్కోలుకై మేఘాలని పిలుస్తున్నాడు. కాస్తంత ముందుగా వొచ్చి వుండకూడదూ? ఏమైతేనేం తీరా బైలు దేరాడుగా....అతని దగ్గర బేటరీలైటు లేదు. సైకిల్‌కి తగిలించే లైటుంది కోటు జేబులో, ఇంకా కాస్తంత పొద్దుంది. పాకలో తడకల కానించిన ఆ నిచ్చెన తీసుకుని చరచరా నడుచుకుంటూ సర్వీచెట్లవైపు నడుస్తున్నాడు. చెట్ల నీడల నడుమ చీకటి అలుముకుంటోంది. ఆ చింతచెట్టుకింద మరీ చీకటిగా వుంది. ఆకుల నడుమ కాస్తంత ఎదిగిన చందమామ. నిచ్చెన చెట్టుప్రక్కనున్న గుట్టమీద జార్లవేశాడు. ఏదో చప్పుడైంది. వింత రొద. భయమేసి అటు ఇటు చూస్తున్నాడు. ఎవ్వరూ కనబడరు. మళ్ళీ ఏదో చప్పుడు—ఎక్కడనుంచి? స్థలం నడుంగా వున్న నూతి అంచుకేసి వొచ్చాడు. ఆ రొద. బావి లోపల్నించి వొస్తున్నది. కోటుజేబులో తీసిన లైటువేసి బావి లోపలకు చూశాడు. అడుగున ఆమె.

నాలుగు రోజులక్రితం చూసినామె. పరిగెత్తి నిచ్చెన లాక్కొచ్చి బావిలోకి దించాడు దీపం గట్టునపెట్టి, కోటు తీసేసి, పంచి మడిచికట్టి, తనూ లోపలికి దూకాడు. మనిషి మునిగేటంతటి లోతు నీళ్ళు లేవు. నిలబడితే అతని భుజం నీళ్ళపైన వుంది. ఆమె చేతులని తన మెడచుట్టూ బిగించమని నడుం పట్టుగుని నిచ్చెన మెట్లు ఎక్కుకుంటూ పైకి వొచ్చాడు. నిచ్చెన మెట్లు అంతటితో ఆఖరు. ఇంకా మూడడుగుల ఎత్తునగాని నూతి అంచు తగలదు. అతను వొంగి, ఆమె రెండు కాళ్లూ తన భుజంపైమోపి, ఎగబ్రాకుతున్నాడు. ఆమె రొప్పుతోంది. తడిసి విడిపోయిన చీర మడతలు మధ్య అతని తల ఇరుక్కుంది. పొట్టమీద చీరముడి విప్పి, బలంగా ఆమె నడుం వెనక చేతిని నొక్కిపట్టి పైకితోశాడు. అంచుకు చేరుకుంది. కుడివైపున సగం సగం ఎదిగిన కొమ్మల ఆధారంగా నిచ్చెనను పైకిలాగి తాను నూతి అంచుపైకి చేరుకున్నాడు సుదర్శనం.

ఆమె ఆయాస పడుతోంది. ఊడిన చీరమడతలు పిండుతున్నాడు. ఆమె కాళ్ళు చేతులు ఊపి సవరిస్తున్నాడు. పొట్టమీద చేతులతో గట్టిగా నొక్కాడు, నోట్లోంచి నీళ్ళు వొచ్చి ఉక్కిరి బిక్కిరవుతోంది. ఆయాసం కాస్త తగ్గింది. సిగ్గుతో పక్కకు తిరిగింది. తన కోటుతో ఆమె వొంటిని తుడుస్తున్నాడు. కోటు లాక్కుని పక్కకు వంగి వొణికిపోతూవుంది.

"కాస్తంత అటుకేసి ఉండండి" అన్నది జీరబోయిన సన్న కంఠంతో. అతను దూరంగా వెళ్ళి చొక్కా పంచె నీరు పిండుతున్నాడు. నిచ్చెన కర్రమీద తల అనించి, పరుండి నక్షత్రాల కేసి చూస్తున్నాడు. చీకటి ముసుగులా కప్పుతోంది. ఆమె శరీరం తాకిడినుండి అతని వొళ్ళు తేరుకుని విడి తనదవుతోంది. భుజాల గుండ్రతనం, నడుం ఒంపు, తీక్షణమైన శ్వాస, తడిని ఆవిరిచేసే పొట్టకింద వేడి, చేతిలో ఇమిడి ఇమడక ఎగిరిపడే స్తనాల గుండ్రతనం, నునుపు, గట్టితనం—వింత స్పర్శ—ఎన్నో కత్తులు విరిగి, వంగి, గుండ్రంగా ముద్దకట్టి రబ్బరుకి

మల్లె పాగుతూ తన చర్మం లోపలికి దూరి, మళ్ళా కత్తులుగా మారి వేడితో కాలుస్తూ, పొడుస్తూ దూరంగా పారిపోయి నక్షత్రమైనట్లు! గాలికి, పంచి ఆరిపోయింది. ఖద్దరుచొక్కా ఇంకా అక్కడక్కడ తడిగానేవుంది. బట్టలు వేసుకున్నాడు, ఆమె దగ్గరకెళ్ళి కూర్చున్నాడు. చీరను ఒంటిమీద దుప్పటిలా కప్పుకుంది. పాదాలని చేత్తో రాసి వేడిచేస్తున్నాడు. అరిచేతుల్ని రాసి వేడిచేస్తున్నాడు.

"ఏమిటి నువ్వు చేసిన పని?"

"సచ్చిపోదామని" కంఠం నీరసంగా ఉంది—ఒణుకుతుంది ఇంకా. పొడుగాటి ఒంకులజుట్టు—పెద్దకళ్ళు—గుండ్రని కనుబొమ్మలు—పెదవుల వెనక పళ్ళ తళుక్కు సన్నటి కోలమొహం—

"ఎందుకు?"

సమాధానం లేదు.

"ఏం, చెప్పకూడదా?"

మాట్లాడదు—పక్కకి తిరిగింది. వేళ్ళతో అతని చేతిని క్షణం నొక్కిపట్టి తోసేసింది.

"ఇంక వెడతా. అమ్మ కూకలెడుతుంది. మీరు రాకుంటే ఈపాలికి హాయిగా సచ్చిందును."

"అదే ఎందుకన్ని అడుగుతున్నాను. అసలు నువ్వెవరవు?"

"అచ్చమ్మ కూతుర్ని—నేను మిమ్మల్నెరుగుదును. డాక్టర్ గారింట్లో మందులిస్తావుంటారుగా. దొడ్లో పనిచేసుకుంటా వుంటే కంత లోంచి కనబడేవోరు. పక్కనే కిష్టయ్యగారింట్లో పనిచేసేదాన్ని."

ఎప్పుడో ఆమెని చూసేవుంటాడు—కాని పరీక్షగా గమనించలేదు. ఇప్పుడు బాగా గుర్తొస్తోంది. మళ్ళా చేతులతో రాస్తున్నాడు.

"అమ్మో" అని తోసేసింది.

"ఏం?"

"మంటెడతా వుంది."

సైకిల్ లైట్ వెలిగించి ఆమె ఒంటిమీద వేశాడు.

మోచేతికింద చర్మం రేగిన గాట్లు, కోసినమచ్చలు, రక్తంలేదు. నూతిలో పడినప్పుడు పొదలు, కొమ్మలూతాకి రేగిన పుండ్లు.

"ఆస్పత్రి దగ్గర కెడదాం. మందేసి బాండేజి కడతా."

"అమ్మో! అమ్మ సంపుద్ది."

"ఈ పుళ్ళేమిటంటే ఏం చెప్తావు?"

"సెర్లో జారిపడ్డానంటా" నవ్వుతోంది.

"ఎందుకూ నూతులోపడటం?"

"పడదామని రొండుసార్లొచ్చా మీ రుంటిరి. ఎట్లాగని ఎళ్ళిపొయ్యా"

"అదే ఎందుకని?"

పక్కకి తిరిగి వెల్లకిలా పడుకుంది మొహం ఒక పక్కకి వాల్చింది.

"రంగమ్మ సెప్పింది డోకులూ అయ్యి సూసి. మూడో మాసమంట. అమ్మ సంపేస్తుంది అమ్మ సంపడం దేనికి? నేనే సద్దామని."

ఏవో కొన్ని సందేహాలున్నాయి కాని ఎట్లా అడగాలో తెలియటం లేదు సుదర్శనానికి.

"చావడం దేనికీ మందులున్నాయిగా"

"ఉన్నయ్యా—ఇస్తారా—అమ్మకి తెలీకండా?"

పక్కకి తిరిగి అతని కళ్ళల్లోకి చూస్తోంది. అతని తల ఆమె వక్షంపై వాలింది. గాలికి ఆకులు కదిలి ఎడమైనప్పుడల్లా సన్నటి వెన్నెల వారి శరీరాలపై కదుల్తోంది.

"రేపిస్తారా మందు?"

సమాధానం లేదు.

"మిమ్మల్నే"

ఉలిక్కిపడ్డాడు. కళ్ళు తుడుచుకున్నాడు.

"చూస్తాలే"

ఆమె లేచింది. దూరంగా వెళ్ళి బట్టలు సరిచేసుగుని నడుస్తోంది.

"రేపొచ్చేదా ?"

"చెప్తాగా"

"నే పోతా ?"

అతను లైటు సరిచేశాడు. ఆ వెలుగులో నడుస్తోంది. గొడ్లపాకలు దాటి వెళ్ళింది. సుదర్శనం కోటు వేసుగుని నిచ్చెన బుజాన తగిలించు గుని గొడ్లపాకకేసి వెళ్ళాడు. నిచ్చెన పాకలో వదిలేసి ఇంటికెళ్ళాడు.

* * *

అన్నాడే కాని ఆ మందేమిటో డాక్టర్ని అడిగే ధైర్యం లేదు సుదర్శనానికి. అక్కడున్న పుస్తగాల్లో చూశాడు. కాని తనకి కావల్సింది వాటిల్లో లేదు. ఏం చెయ్యాలి ? అమ్మకి తెలియకుండా మందివ్వమంది. ఆస్పత్రికే ఒస్తుందా ? వాళ్ళ ఇల్లెక్కడ ? ఆమె పేరేమిటో ! తనకి ఆమెని గురించి ఏమీ తెలీదు. అయినా ఆమె నెరుగున్నంత గాఢంగా మరెవర్నీ అతనెరుగడు. అతని స్నేహితుడు గున్నాధం పై ఊర్లో డాక్టరు. అతనికి వ్రాసి కనుక్కుంటే ? ఇట్లాంటివి ఉత్తరాల్లో వ్రాయకూడ దేమో. ఆ ఊరెళ్ళి గున్నాధంతో స్వయంగా మాట్లాడి తెలుసుకోడానికి నిశ్చయించాడు. ఆ రాత్రికి నిశ్చింతంగా నిద్రపొయ్యాడు. మర్నాడు, ఊరు వెళ్ళడం బదులు, డాక్టర్ స్నేహితుడికి ఉత్తరం వ్రాసిపడేశాడు. జవాబు కోసం ఎదురు చూసిన నాలుగు రోజులూ, అతను పూరవతల బావి దగ్గరకు వెళ్ళలేదు.

ఐదోనాడు సాయంత్రం అటుకేసి వెళ్ళాడు. సాయంత్రం ఐదు దాటింది. అవే చెట్లు అదే బావి—లోపల తాబేలు పిల్ల. మరో రోజు కాస్తంత పెందరాళే నిచ్చెనతో వొచ్చి, ఆ బావిలో మొక్కల్ని తీసికెళ్ళి

పరిశీలించాలి. ఆ సాయంత్రం వారిద్దరూ ఎట్లా పైకొచ్చిందీ స్మరించాడు. ఆమె అక్కడ పరుంది తనిక్కడ చొక్కా ఆరబెట్టుకున్నాడు. ఈ గడ్డిలో ఆమె జడ – అంగుళం మేరలో అవి ముళ్ళు, బావిలో పడ్డప్పుడు, ఏ కొమ్మ ఆమె చేతిని గాయపరిచిందో? సంధ్య వెలుగు చెట్ల వెనక దాగిలి మూతలాడుతోంది. ఆ మబ్బుల నడుమ నలుపు నీడలు—ఆమె శరీరపు చాయ ఆ రకం నలుపే మధ్య పాపిడినుండి విడిపోయిన తలవెంట్రుకలు కనుబొమ్మల మీదికి జారినప్పుడు, ఏదో క్రౌర్యం—కోపం కొండమీదికి పాకినట్లు, కొత్తనీటిని మీదికి సోకనివ్వకుండా, వేడెక్కి పైకుబికిన నేలకి మల్లె – చితిలో బిగించిన పుష్పం జడలో కత్తిగా దూసుకుపోయినట్లు— అదేదో వుంది ఆమెలో—అతను విడమర్చి చెప్పలేడు. ఇదేదో నూగు నడుమలో కొత్తరకం ఆకులా వుంది. ఏరడం మొదలెట్టాడు.

పశ్చిమ ఆకాశంలో ఎఱుపు కరిగి, దట్టమైన నల్ల మేఘాలు అలుము కున్నాయి గాలి జోరుగా వేస్తోంది. ఇంకెక్కడా జాగాలేనట్లు సర్వేచెట్ల మధ్య తారట్లాడుతూ; ఆవులింత ఆపుతూ చిటికలు వేసినట్లు ఎండుకొమ్మలు విఱిగి పడుతున్నాయి. నేలమీద ఆకులు పైకి లేస్తున్నాయి. పల్చటి ఆకులు పక్కకి ఎగురుతున్నాయి. చీకటి ముసుగులా కప్పి జోలపాడుతున్నట్లు వింత ధ్వనులు రేగాయి. క్షణం అంతా నిలిచిపోయింది; ఆ క్షణంలోనే నిండైన వర్షపు చుక్కలు బరువుగా పడుతున్నాయి. కాసేపు ఆ దిక్కు, కాసేపు ఈ దిక్కు—దిక్కు తెలుసుకున్నాక, తొంభై డిగ్రీల కోణంలో తిన్నగా పడుతున్నాయి. సుదర్శనం, పరుగెట్టి గొడ్లపాకలో చూరుకిందికి చేరుకున్నాడు. పాతగోనెసంచుల కుప్ప వెనక కూర్చున్నాడు. అంతా చీకటి—చీకటి స్వరూపం చూపెడుతూ మెఱుపులు — ఆ మెఱుపులో ప్రక్కనే నిలబడ్డ ఆమెను చూశాడు.

"నువ్వా?"

"మందు తెచ్చావా?"

"ఉహూ"

"తెస్తానంటిరిగా. కలుద్దామని రోజూ వొచ్చిపోతుండా. ఊరెళ్ళారా?"

"ఉహూ"

"రేపొచ్చేదా ?"

"ఉహూ"

పశ్చిమ ఆకాశంలో పిడుగుల ప్రతిధ్వనులు.

"ఇక్కడెందుకున్నావు ?"

"అహ" అందామె.

"అహ ఏమిటి ?"

"పోనీ 'ఉహూ' అనేదా ?"

"ఓ, అదా" నవ్వుతూ అనడం ఆమెకి చీకట్లో తెలియదు.

"మీ రొస్తే కనుక్కుందారని బైలుదేరేతలికి వర్షం — ఇక్కడి కొచ్చా" ఆమె నవ్వుతూ అన్నది ఇతను చూడలేదు.

"ఆ రోజున నిచ్చెన తెస్తం దేనికి ? నూతిలో పడతానని ఎట్ట తెలుసు ?" వర్షం నిలిచిపోయింది. శత్రువుని వెంబడిస్తున్నట్లు పిడుగులు దూరదూరంగా ప్రతిధ్వనించి కంఠాలు పోగొట్టుకుంటున్నాయి.

"అందుకోసం కాదు. నూతి పళ్ళెం దిగువలో మొక్కలు కోదామని — మందుకి పనికొస్తాయేమో చూద్దామని, ఇదుగో ఈ నిచ్చెనే తెచ్చాను." అని అక్కడున్న నిచ్చెనకేసి చూపాడు. మెఱుపు వెలుగులో నిచ్చెన చూసిందామె.

"అదేంమ్మందు ? నాకిచ్చెదా ?"

"నీకు తెలీదులే."

"మరిగని రేపొచ్చేదా ? — చొప్పన ఇంటికెళ్ళాలె, అమ్మ పెందలకడే వొస్తానంది. ఈ పాలికి వొచ్చే వుంటుంది. మరిగని పోయేదా ?" అంటూనే, చీర అంచులు మడమలపైకి లాగి, పడిపోకుండా,

అటూ ఇటూ కదుల్తూ, తూలుతూ వెళ్ళింది. ఏమిటో ఈ వర్షం గొడవలో ఆమె పేరుకూడా అడగలేదు. ఏవో కొన్ని ప్రశ్నలు అడగదల్చాడు. వాటికి సమాధానం తెలిస్తే మూడో మాసమో, రెండో మాసమో తెలుసుకోవచ్చు. కాని ఎలా అడగడం? ఆస్పత్రికి రప్పించి మంత్రసాని బంగారమ్మని చూడమంటే? చావబొయ్యేదాన్ని రక్షించాక, ఆమె పట్ల తనకేదో బాధ్యత వున్నట్లనిపిస్తోంది. రక్షించడం మంచిపని. ఆమె కోరింది చెయ్యడం తప్పు. అంతా గంద్రగోళంగా వుంది. ఇంటికెళ్ళాడు సుదర్శనం. సాయంత్రం టపాలో వచ్చిన డాక్టర్ ఉత్తరం చూసుకున్నాడు. అందులో తను అడిగినదానికి మందేమిటో వ్రాయలేదు. సరికదా, ఎవరికి, ఎందుకు వివరాలు తెలుపవల్సిందిగా వుంది. కలసి మాట్లాడుకుందాంలే, అని ముగిసింది గుర్నాథం ఉత్తరం. సరేలే—అనుకున్నాడు. మళ్ళా మూడురోజులయ్యాక బైలుదేరాడు. పాడుబడ్డ బావి స్థలం దగ్గరకు. స్థలంపట్ల ఇదివరకున్న మక్కువ అతనిలో ఇవాళలేదు. ఆకులూ, రెమ్మలూ, వ్రేళ్ళూ ఇదివరకే కోసుకెళ్ళాడు, పరిశోధనికి కావల్సిన ద్రావకాలు, పరికరాలు డాక్టర్ గారి ఆస్పత్రిలో లేవు. అది ఒకరివల్ల అయ్యే పనికాదు. ఎందరో రసాయనిక శాస్త్రజ్ఞులు పూనుకుంటేనే ఆ పరిశోధనలకి ఫలితం వుంటుంది. అందుకు తగినంత పరిజ్ఞానం, శిక్షణకూడా తనకి లేవన్న జిజ్ఞాస ప్రస్తుత నైరాశ్యానికి కొంత కారణం.

నిజమే, బావిలోపలి భాగంలో కొన్నింటిని పైకిలాగి తీసుకెళ్ళాలి మరెప్పుడన్నా, మళ్ళా ఆ గొడ్లపాకలో నిచ్చెన తెచ్చుగుని, ఆ ఉడతని చూస్తున్నాడు. ఏదో పోగుచేసి బంతిలా చుడుతుంది. చీపురుపుల్ల నూగుని దారంలా పెనవేస్తుంది ఎందుకో. అల్లా వెదుతోంది ముంగిస, ఇక్కడ పాములుకూడా వుండొచ్చు. తనకేదో దిగులుగా వుంది. సర్వీచెట్ల దిగువ గడ్డిని సరిచేసుకుని పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు. అతనికి పెండ్లి కాలేదు. ఇద్దరు తమ్ముళ్ళకి చదువు చెప్పించే భారం తనమీద పడింది.

అందుకే చదువు పూర్తవకుండా డాక్టర్ దగ్గర కాంపౌండర్‌గా కుదురుకోవాల్సి వొచ్చింది. ప్రెసిడెంట్ భద్రయ్యగారు తనకి స్కాలర్ షిప్ ఇప్పిస్తామన్నారు నిజమే. ఎవరన్నా పెద్దకట్నంతో పిల్లనిస్తే, కొంత కలిసొస్తుంది. కాని కట్నం పుచ్చుకోవాచ్చా? అతని కిష్టంలేదు. అంతా గంద్రగోళంగా వుంది. శరీరం వేటినో కావాలంటుంది. దాని వొత్తిడి అదొక రకమైంది. దానికి అశుభం శుభం, మంచి చెడుగు తెలియవు. అప్యాయత, వెచ్చదనం, మెత్తగా, దగ్గరగా, కాల్చేసే వేడి—అబ్బో శరీరం ఎంత వేడి!—రక్తానికి ఎంత వేగిరపాటు! నాళాలు, నక్షత్రం మినుకు మన్నట్లు అల్లా గుండెతోబాటు కలిసి దడ దడ కొట్టుకుంటూ వుంటాయి. అదే జీవుడు. వెనక్కి ముందుకీ, అటు ఇటు అల్లా కొట్టుకుంటూ వుండాలి.

నక్షత్రాలు, విశ్వంలో గోళాలు— అన్నీ అంతే—అల్లా కొట్టుకుంటూ ఉంటాయి. అదే సృష్టి. కాని జీవుడు స్వయం పోషకం, స్వయం ప్రకాశం కాదు. మరొక దాంట్లోపడాలి—కలవాలి—కలిసి ఏకమవాలి. ఆ మరొక దాని కోసరం అన్వేషణ. కళ్ళంట నీళ్ళుకమ్మి, చుక్కలుగా బుగ్గలమీదికి జారడం అతనికి తెలుసు, అదొక బాధ. అందులో వింత, ఆనందం వుంది. కన్నీటిని ఆపే యత్నం చెయ్యలేదు. తనొక మనిషి—ఆ కన్నీరొక మనిషివి. కాని గమనించే లోకానికి ఒకే మనిషి, ఇద్దరు లేరు. అక్కడ గమనించే వారెవ్వరూ లేరు. రెండు రోజుల్లో పూర్ణిమ. పెద్ద చందమామ చల్లగా కదుల్తోంది. మేఘాల నడుమ. చందమామలో ప్రాణులు లేరట! నిర్జీవమైన గోళంట. అయినా చిత్రం, భూమిచుట్టూ తిరుగుతూ వుంటుంది! సముద్రంలో కెరటాలని రేపుతుంది. సుదర్శనం లేచి, బట్టలు సర్దుకుని, బయలుదేరాడు.

చింతచెట్టు దాటగానే ఆమె ఎదురైంది. ఆకుపచ్చ చీర, అదేదో రంగుది గళ్ళరవిక—వొగురుస్తూ, తమాయించి తేరుకుంది.

"మీకోసరమే వస్తుండా—తెస్తిరా ?"

"ఏమిటి ?"

"అందేనండీ—మందు"

"ఓ అదా—ఆస్పత్రికి రా, పరీక్ష చేయిస్తా. అసలు అదో కాదో -తేల్చుకోవాలి ముందు."

"ఇంకా నయం—పరాయోడికి తెలిస్తే అమ్మ సంపదూ" అని ఎబ్బెట్టుగా తన గుండెమీద చెయ్యి మోపింది.

"ఎందుకంత భయం. అసలేం జరిగింది ? పెండ్లి చేసుకో రాదూ ?"

"రండి ఇట్ట కూకోండి సెప్తా, ఆయనకి పెండ్లా ముందిగా"

"ఓ, అల్లాగా."

చెట్టుకింద గడ్డిలో కూర్చుని మోకాళ్ళమీద గడ్డం ఆనించి, చేతులు పాదాలచుట్టూ బిగించి మాట్లాడుతోంది.

"పిల్లలు కూడా"

అతనేమీ మాట్లాడలేదు.

"ఏం అట్ట దిగులుగుండారేం ? పోనీ లెగండి. మరిటొచ్చి మందుకు తొందరసెయ్యను లెండి— బావిలో పడి సావనంటండి."

"అదే కూడదు. చాలా తప్పు, మనం ఏం చేసినా బ్రతికుండగానే, అది చెయ్యనని చేతులో చెయ్యివెయ్యాలి" అని చెయ్యి చాచాడు. కళ్ళు తుడుచుకుంటోంది కాబోలు. చీర కొంగు మొహం అంతటా కప్పింది.

"మట్టి చెయ్యి, దేనికిలెండి. అమ్మ సంపుద్దనే భయం—మరే బెంగ లేదు. ఇంక సావనులెండి....ఏం ?"

"అల్లా వుండాలి, ఎవరాయన ?"

"నా కింకా తెలిసింది కాదు. జబ్బుతో పెళ్ళాం మేడపై గదిలో మంచం దిగదు. ఈన పట్టుగున్నాడు. రోజూను డబ్బులిస్తాడు. తొందర

పేత్తాడు. సిత్రంగా ఉంటాడు గమ్మత్తు సెప్పోదా ? మతిమరుపంట, మరిసి పోకుండా ఉంటాని కని రూపాయలు, నోట్లు అగ్గిపెట్టెలో దాసుకుంటాడు. అగ్గిపెట్టెలో పుల్లలు అయిపోగానే, పెట్టెని పారేస్తే, దాసిన నోటు ఇసయం మరిసినట్టేనంట. సావిడిగదిలో రెండుమార్లు దొరికినై ఖాళీ అగ్గి పెట్టెలు. అటిల్లో రూపాయల నోట్లున్నై. చేతికిచ్చా. నవ్వి "నువ్వు తీసు కోవే నోట్లు" అన్నాడు. ఓ దఫా పదిరూపాయల నోటు దొరికింది. గోడవతల ఊడ్చినకాడ, పడేసిన అగ్గిపెట్టెలో మరోమాలి, ఐదు రూపా యలు—అదేటో మతిలేని తతంగం. ఎంత కాలం—ఏటిసెయ్యను. ఓపాలి ఇట్టపేస్తే అమ్మగారితో సెప్తానన్నాను. గడ్డంబట్టి బ్రతిమలాడాడు, డబ్బిచ్చాడు, మరో పాలి సంపుతానని పైన బడ్డాడు. అదిరిపోయినా పన్లో కెడతం మానుకున్నా, అమ్మ కసిరింది. మరో లోగిలి సూసుకు సావ మంది—సద్దామని ఈడకొస్తే, మీరుంటిరి. ఆ నిచ్చనోటి తెచ్చి, పొద్దో తోంది అమ్మొస్తుంది. సాయంతలం పన్లోకెడుతుండగా—అప్పుడే ఇటు రావడం. రంగమ్మ సూత్తానంది లెండి మందు ఇసయం, మరెల్తా" అని లేచింది.

"అమ్మో, అటెవరో వొస్తుండారల్లె వుంది సెట్టువెనక కూకుంటా" అని వెళ్ళి కూర్చుంది.

"నీకు చాలా భయముందే—లే, లే—వాళ్ళు అటుపోతున్నారులే, పొలంకేసి"

"మీకు తెల్దులెండి. మీకూ నాకూ ఏదో వుందని వూళ్ళో సెప్పు కుంటున్నారుట. రంగమ్మ సెప్పిందిలెండి" అని లేచి చెట్టుదాటి. కంప తప్పించుగుని, పెద్ద పెద్ద అంగలువేస్తూ నడుస్తోంది ఆమె.

"మొదటి రెండుసార్లు నువ్వు వెళ్ళిపోవడం చూసి దయ్యమను కున్నాను తెలుసా ?" అన్నాడు.

"అమ్మో, దయ్యాలంటె భయం. పోనీ, ఎక్కడన్నా పన్లో కుదర్చ గలరా ?"

"ఎల్లుండి రా — ఆ విషయం చెప్తా"

"పన్లో కుదురుస్తారా ?"

"అదికాదు — మందు విషయం" అన్నాడు.

"ఓ...."

వెళ్ళింది. సుదర్శనం బైటకి వెళ్ళాడు పొలంకేసి. దానివతల పంటకాలవ, అక్కడ పదినిమిషాలు కూర్చుని, ఇంటివైపు నడచాడు. తన విషయం తనకే ఆశ్చర్యం వేసింది. ఆమె పేరూ - తెలుసుకోలేదు. ఆ మరో వ్యక్తి పేరు తెలుసుకోలేదు. రంగమ్మెవరు ? తెలియదు నిజమే, అందుకే నిశ్చింతగా వుంది. ఏదో బరువు తొలగినట్లయింది. సగం భారం ఆ రంగమ్మది. హాయిగా నిద్ర పట్టేసింది.

* * *

ఎల్లుండి కూడా వొచ్చింది. పై వూర్లో డాక్టర్ గుర్నాథంకి మరి కొన్ని వివరాలువ్రాసి, వీలైతే ఓ పూట రావల్సిందిగా కోరాడు సుదర్శనం. తను పనిచేసే డాక్టర్ మధ్యాహ్నమే మరో వూరు వేరే పనిమీద వెళ్ళడం వల్ల, నాలుగింటికే డిస్పెన్సరీ మూసేసి తన గదికొచ్చి, టీ కలుపుకొని, ఖద్దరు పైజామా, చొక్కా వేసుకుని, ముస్తాబై, పైన కోటువేసుకుని బైలుదేరబోతుండగా, గుమ్మంలో మోటారు సైకిల్ ఆగిన చప్పుడైంది. లోపలి కొచ్చిన వ్యక్తి స్నేహితుడు భూషణం. ఎగ దువ్విన క్రాఫ్, పాంట్, బుష్షర్టు బుజాన ఒక బాగ్, లావుగా, పొడుగ్గా ఉంటాడు. భూషణం, సుదర్శనం ఒకే పాఠశాలలో రెండేళ్ళు కలిసి చదువుకున్నారు. భూషణం తండ్రి బాగా ఆస్తిగలవాడు. కాలేజి చదువు చాలా కాలానికి పూర్తిచేశాడు. తెలివైన వాడని చెప్పుకునేవారు. కాని కాలేజీ కెళ్ళాక, పెద్ద పరీక్షలు ఫేలవుతూ వచ్చాడు. నాటకాలంటే సర్దా. పాఠ్య పుస్తకాలు చదవక, నవల్సు — ముఖ్యంగా డిటెక్టివ్ నవల్సు చదువుతూ, పరీక్షపట్ల శ్రద్ధ కనబరిచేవాడు కాదు. పొడుగాటి మనిషవటంవల్ల పోలీసు శాఖలో

చేరాలన్న అభిప్రాయంవల్ల కాబోలు. తండ్రి పలుకుబడిద్వారా, సబిన్స్పెక్టర్ ఉద్యోగం సంపాదించాడు. అక్కడికి నాలుగు మైళ్ళలో వున్న ఊరికి బదిలీ అయ్యాడు. ఈ మధ్యనే చార్జీ పుచ్చుకున్నాడు. సుదర్శనం ఇక్కడున్నట్లు విని చూసి పోదామని వొచ్చాడు.

"నాకు తెల్సోయ్ నువ్వు ఉత్తరాలు వ్రాసే ఘటం కావని, లేజీ బర్డ్. రంగమ్మ నెరుగుదువుగా.... ?"

సుదర్శనం అదిరిపడ్డాడు.

"ఏ రంగమ్మ ?"

"సర్లే, నాకు తెలుసు మరిచిపోతావని. సోమరితనానికి మతిమరపు కూడా జోడైందన్నమాట ! రంగనాథాన్నెరగవూ ? లెక్కల్లో ఫస్టు—ఆడపిల్లల్ని కులికేవాడు—రంగమ్మని ముద్దు పేరు, [illegible]ను వ్రాశాడు నువ్వు ఈ ఊళ్ళో ఉన్నావని ఆదర్శమూర్తిని అన్వేషిస్తూ, తప్పుకు మందులిచ్చి, దేశం జనాభా తగ్గిస్తున్నావని ..." అని విరగబడి నవ్వడం సాగించాడు భూషణం.

స్కూల్లో గడిపిన దినాలు, అప్పటి స్నేహితులు, విడిపొయ్యాక ఎవరెవరు ఏమైంది చెప్పుకుంటూ, మధ్య మధ్య టీ త్రాగుతూ, గంట గడిపారు. ఐదున్నరైంది.

"కృష్ణమూర్తికి పెండ్లయింది తెలుసా ?" అన్నాడు భూషణం.

"కృష్ణమూర్తంటే.... ?"

"నాకు తెల్సునోయ్....నీ కెవ్వరూ గుర్తు రారు. నువ్వొక దంతపు బురుజు నివాసివని—కృష్ణమూర్తి రాధికా స్వాంతుడోయ్—అస్తమానూ తులాభారం నాటకంలో పద్యాలు చదివే వాడే....వాడు: ఏం చేశాడ్డ— ఓ పిల్లతో స్నేహం చేశాడ్డ—పెండ్లయిన ఏడుమాసాలకే భార్య పిల్లాడిని కందిబ రెంతు రెండు కలుపు—సర్లే నీకు లెక్కల్లో సున్నాయేగా ఎప్పుడూ—అంటే పిల్లకి మూడో మాసమున్నిర్ధారణవంగానే, పెండ్లి

చేసుకోక తప్పింది కాదు...." అని నవ్వుతున్నాడు భూషణం సుదర్శనం మనస్సు ఎల్లాగో అయిందది. తబ్బిబ్బై తమాయించుకున్నాడు.

ఆరవొస్తోంది.

"చూడు, వో పదినిమిషాలు అల్లా ఊళ్ళోకెళ్ళి ఓ పేషంటుని చూసి రావాలి. నువ్వు ఈ పత్రిక చూస్తూ కూర్చో" అన్నాడు సుదర్శనం.

"ఈ ఊరి జనాభాలో మరొక మనిషి తగ్గిపోతాడులే! పేషంట్ ఆడా, మగా....?"

"సర్లెద్దూ నీ జోక్సూకేం నీకు పెండ్లయిందా ?"

"ఓ, మా ఫాదర్ ప్రెషర్. పెద్ద కట్నం పట్టుపట్టుమని చేసేశారు. ఏడాది పిల్లాడు."

"ఫామిలీ వొచ్చారా ?"

"వెళ్ళి తీసుకురావాలి...."

"ఇప్పుడే వొస్తా — ఇద్దరికి కారీయర్ ఏర్పాటు చేసొస్తాను."

"ఒద్దు బ్రదర్. వెనకాల కూర్చో హాయిగా వెన్నెట్లో మా వూరు పోదాం. అక్కడ ఫస్టు క్లాస్ భోజనం వొండి పడేస్తారు...."

"సర్లే—ఇప్పుడే వొస్తా."

"పద, నేనూ వొస్తాను—మోటర్ సైకిల్ మీద పోదాం" అని లేచాడు భూషణం.

"ఒద్దు, ఒద్దు, నా మందుకి నీ సైకిల్ చప్పుడు జోడైందంటే, పేషంట్ హరీ మంటాడు....నే వెళ్ళొస్తాలే...."

"సో — నువ్వా వేస్తావన్న మాట జోక్సు. తీసుకు రాలేదనుకో— హాట్స్ ఆఫ్ సరే పో."

సుదర్శనం తొందరగా వెళ్ళాడు. అరున్నరైంది, చీకటి పడుతోంది చింతచెట్టు కింద చేరుకునేటప్పటికి. అటు ఇటు చూశాడు. ఎవ్వరూ లేరు ముంగిస పరుగెత్తింది. పక్షులు కొమ్మల మధ్య కొట్లాడుకుంటు

న్నాయి. కీటకాలు రోదిస్తున్నాయి. సర్వీచెట్టుకింద కాసేపు పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు. ఎవరో అటు నడుస్తున్న చప్పుడైతే, లేచి చూశాడు. ఎవరూ కనపడలేదు. పదినిమిషాలైంది. పావుగంటైంది. చీకటి దట్టమవుతోంది. నూతి దగ్గరకొచ్చాడు. కోటు తీసేసి పక్కన పెట్టాడు. చొక్కా చేతులు మడిచి, నూతి వర దిగువనున్న మొక్కల్ని చూస్తూ, అందిన వాటిని ఒక్కొక్కటే పైకి లాగుతున్నాడు.

వొంగి లేవడంవల్ల కలిగిన ఆయాసం నుండి కోలుకునేందుకు, మొహాన్ని మోకాళ్ళ మధ్య పెట్టి కాసేపయ్యాక; మళ్ళా లోపలికి వొంగి మొక్కల్ని వెదుకుతున్నాడు. ఏదో పెద్ద చప్పుడైంది. మరో క్షణంలో ఎవరో తోపు త్రోసినట్లయినది. ఆ, ఆ, అని పెద్దగా కేకేసి నూతిలో పడి పోయాడు.

పడేటప్పుడు కొమ్మ తగిలి వెన్నుమీద గాయమైంది. ముళ్ళు గుచ్చుకుని వొళ్ళంతా మంటలు, నీళ్ళలో లేచి నిలబడ్డాడు.

"ఇదుగో, నిన్నే, నిన్నే," అని పెద్దగా అరుస్తున్నాడు. భయంతో వొణికిపోతున్న కంఠం, నూతి గోడల నడుమ ప్రతిధ్వనించి; భయంకరంగా వినబడుతోంది. దెబ్బల్ని, గాయాల్ని చూసుకుంటున్నాడు. నెప్పివల్ల, అబ్బ అనుకుంటున్నాడు.

"ఎవరక్కడ — నిన్నే — ఇదుగో నేనే — ఇక్కడ. లోపల, ఇదుగో యీ నూతిలో. ఎవరది? ఏమర్రో" అని మళ్ళా కేక వేస్తున్నాడు. ఆమె తల నూతి గట్టున కనబడింది. "అమ్మొ, సచ్చిపొయ్యారు. అమ్మొ" అని కేక వేస్తోంది.

"చావలేదు— బాగానే వున్నాను. ఆ నిచ్చెన తీసుకురా గొడ్లపాక లోది" అని బిగ్గరగా అరిచాడు సుదర్శనం. కాసేపయ్యాక ఆమె తల మళ్ళా కనబడింది. నిచ్చెన లోపలికి దింపుతోంది. కిందికి అనడం లేదు.

"ఒదిలెయ్యి" అన్నాడు. ఒదిలేసింది. పైజామా పైకి మడిచేసి

నిచ్చెన మీదికెక్కుతూ పైకొస్తున్నాడు. పై మెట్టుకి చేరాడు. నూతి అంచు ఇంకా దూరంగా వుంది. చేతికి అందడంలేదు. ఆమె చేతులు లోపలికి అందిస్తూ ముందుకు వొంగింది. అతని చేతులు పట్టుకులాగుతోంది. కాసేపు పెనుగులాడాక, పైకి చేరుకున్నాడు. నేలమీద పడిపొయ్యాడు. అతని తలని తొడపైకి లాగింది. చొక్కాని పైకి లాగేసింది. నీళ్ళని పిండుతోంది. చీర కొంగుతో తడిని తుడుస్తోంది.

"నీళ్ళు మింగలేదుగందా? అమ్మో? ఇయ్యన్నీ దెబ్బలే రక్తం. ఉండండి బండిని కేకేస్తా. అస్పత్రి కెడుదురుగాని. లాంతరు తెస్తా. నూతులో పడ్డారేంది?

"నీ మాదిరే చచ్చిపోదామని"

"మీకేం వచ్చిందండీ?"

అతనేమీ మాట్లాడలేదు. మళ్ళా మొదలెట్టింది.

"నాకు అట్టాంటి పనులొద్దని మీరు సేసిన పనేంది? ఇంక సెయ్య వని వొట్టెయ్యండి సేతులో" అని ఆమె చేతిని ముందుకు చూపింది.

"వొద్దులే—ఇవి రక్తం తడిచేతులు, నిజంగా చావాలని దూకానను కున్నావా—లోపలికి చూస్తూంటె కళ్ళు తిరిగి పడ్డానంతే" అతని తలని మెల్లగా దించి బైటకెళ్ళింది. పది నిమిషాలు ఆకాశంలోకి చూస్తూ పడు న్నాడు సుదర్శనం. కాసేపటికి ఎద్దుబండి, లాంతరు ఆమె, మరో ఇద్దరు ఆసాములు వచ్చారు. లాంతరు పెద్దదిచేసి వింతగా చూశాడు. ఏమైందని గుసగుసలు సాగించారు. ఆమె ఏదో చెప్తోంది—"కాలు జారి పడ్డాడంట" ఆ ఇద్దరు ఆసాములూ, బండివాడూ సుదర్శనాన్ని లేవదీసి, చేతులు మీద మోసుకెళ్ళి బండిలో చాపమీద పరుండబెట్టారు. ఆమె బండి వెనకాలే నడుస్తూ వాళ్ళింటి సందులోకి రాగానే దిగబడిపోయింది. పావు గంటలో బండి సుదర్శనం గది దగ్గరకొచ్చింది. భూషణం నివ్వెర పొయ్యాడు. అతనూ వొక చెయ్యివేసి సుదర్శనాన్ని లోపలికి తెచ్చి

మంచంపైన పరుండబెట్టారు. బండి వాడికి డబ్బులిచ్చి పంపించివేసి, ఆస్పత్రి తాళాలు తీసుకుని నౌకరు సుబ్బయ్యని రమ్మని గాయా మందులు, బాండేజిలూ తెచ్చి, ప్రథమ చికిత్స కానిచ్చాడు భూషణం. వెన్ను మీద మూడంగుళాల పొడుగు గాయం, మోకాలుమీద కొంచెం చిన్నగాయం. చేతులుమీద గీసుకుపోయిన మచ్చలు — అరగంట కళ్ళు మూసుకుని లేచి మాట్లాడడం సాగించాడు సుదర్శనం. రాత్రి తొమ్మిదైంది. ఆస్పత్రి నౌకరు సుబ్బయ్యని కారియర్ భోజనం పట్టుకురమ్మని పంపాడు. జరిగిన ఉదంతం అంతా విపులంగా చెప్పాడు భూషణంతో.

"ఏదో పెద్ద చప్పుడైంది — ఎవరో తోసేసినట్టు పడ్డానంటున్నావ్. అంటే ఏమిటి అడిగాడు భూషణం.

"అప్పుడల్లా గనిపించింది. మళ్ళా ఇప్పుడు జ్ఞాపకం చేసుకుంటే, కళ్ళు తిరిగి పట్టుజారి ప్రమాదవశాత్తు పడిపొయ్యానా, అనిపిస్తుంది" ఎవరో వొచ్చిన సందడైంది. ఆమె లోపలికికొచ్చి తలుపు పక్కనే నిలబడింది.

"ఎవరది?" అన్నాడు భూషణం.

"అరికెట్లాగుందండి ఇదుగోనండి అరి కోటు. బావికాడ పడుంది. ఎల్లితీసుగొచ్చా." అని సుదర్శనం కోటుని భూషణానికి అందజేసింది.

"చీకట్లో దానికోసం వెళ్ళావా వొక్క దానివీ? నాకు బాగానే వుందిలే. ఇంటికెళ్ళు మీ అమ్మ కేకలేస్తుందేమొ"

"మరి రేపొస్తాలెండి"

ఆమె వెళ్ళింది.

"ఎవరోయ్ ఈ పిట్ట?"

సుదర్శనం నవ్వుతున్నాడు.

"నేను చెప్పానే కథ — అందులో ఆమె — ఇంతవరకూ పేరడగలేదు."

"తెల్పకయె తెల్పుచున్నది — కంట్రిబ్యైప్ అనుకో. నాట్ బాడ్ నాపెటాల్ బాడ్" అని ఆమె తెచ్చిన సుదర్శనం కోటుజేబులు కెలికి, ఒక జేబులోంచి ఒక కాగితాన్ని తీసి, మడత విప్పి చూశాడు. అదొక ఉత్తరం, అందులో తను ఆత్మహత్య తలపెట్టినట్లు, అతని చావుకి ఎవరూ బాధ్యులు కానట్లు రెండే వాక్యాలున్నాయి సుదర్శనం సంతకంతో. లోపల చదువు కుంటూ వుండగా, ఆ ఉత్తరాన్ని లాక్కుని చూశాడు సుదర్శనం.

"ఇదెల్లా వొచ్చింది? నేను వ్రాసింది కాదే!" అన్నాడు ఆశ్చ ర్యంగా.

"నువ్వు వ్రాసింది కాదా?"

"ఎబ్బె, ఇదెవరి పనో. ఆత్మహత్య చేసుకుందామని ఎప్పుడూ అనుకోలేదు" అన్నాడు సుదర్శనం.

"మాంచి ఖూనీకేస్ మధ్యలో వొచ్చిపడ్డాను. నా థీరీ విను. నువ్వు బావిలో తొంగి చూస్తుండగా, వొక వ్యక్తి—నిన్ను చంపడానికి సంక ల్పించిన వ్యక్తి—నిన్ను లోపలికి తోసేశాడు. ముందుగా తనే వ్రాసి సిద్ధంగా తెచ్చిన ఈ జాబుని నీ కోటు జేబులో పెట్టాడు. సాయంత్రం రోజూ ఆ బావికే వెడుతూండడం గమనిస్తూన్న వ్యక్తి. నేరం జరిగిన చోటు Scene of the crime—శోధించాలి — మరికొన్ని క్లూస్ దొరుకుతాయి, ఇప్పుడెళ్ళి చూసిరానా?"

"ఇంత చీకట్లోనా, ప్రొద్దున్నే వెడుదువుగానిలే" అన్నాడు సుదర్శనం. బాండేజ్‌ని సరిచేసుకుంటూ.

ఆ ఉత్తరం ఇల్లాగియ్యి. ఈ దస్తూరిద్వారా, దీన్ని వ్రాసిన వ్యక్తినీ పట్టొచ్చు. దీనిమీద వ్రాసినాయన వేలుముద్రలుంటాయి. పట్నంలో నా ఫ్రెండొకడున్నాడు — ఫింగర్ ప్రింట్స్ శాఖలో. అతనికి పంపించి వేలు ముద్రల ఫోటోగ్రాఫ్ తెప్పిస్తాను" అని చీటిని భద్రంగా మడచి కవర్లో నుంచి తన బాగ్‌లో దాచాడు భూషణం. రాత్రి గడిచిపోయింది.

తెల్లవారిం తర్వాత టిఫిన్ కాఫీలు అయ్యాక ఆస్పత్రి నౌకరు సుబ్బయ్యని తీసుగుని బావిదగ్గర కెళ్ళాడు భూషణం. స్థలాన్ని శ్రద్ధగా పరిశీలించాడు. రాత్రి సుదర్శనం పడున్నచోటు బెడ్డలమధ్య రక్తం మరక లున్నాయి. చింతచెట్టు వెనక దట్టంగా అలుముకుని గోడలా పాకిన కంపలో మధ్య ఒకచోట కంత వుండడం గమనించాడు. మనిషి దూరేం దుకు వీలుగా ఎవరో చేసిన కంత. అందులోంచి దూరి చూశాడు భూషణం. కంతకీ, చింతచెట్టుకీ నడుమ వొక ఇనపకడ్డీ—రెండుగా మెలి కలు తిరిగినదీ—పడి వుంది. మోటార్ స్టార్టర్ ఆకారంలో పాత ఇనప కడ్డీ. బావిచుట్టూ పరిశీలించాడు. అతనికింకేమీ ఆనూకీలు దొరకలేదు. నూతిలోపలికి వొంగి చూశాడు. దిగువ పాచినీళ్ళలో తాబేలు పిల్ల వుంది. ఇరువైపులా, కొమ్మలు, ఆకులు, తీగెలు నూగు ముసిరి ఉన్నాయి. రెండు కొమ్మల్ని పెనవేసుకున్న ఎంకుతీగెలో చిక్కుకుని వొక అగ్గిపెట్టె కను పిస్తోంది. పూచిక పుల్లలతో పంగల కర్రలాచేసి, అగ్గిపెట్టెను పైకి లాగారు. మోగించారు. చప్పుడు లేదు. ఖాళీది. దాన్ని వొక కవరులో వుంచి, ఇనపకడ్డీ చివరలో పట్టుకుని, సుబ్బయ్య తెచ్చిన బండిలో ఇంటి కెళ్ళారు.

"ఇదిగో క్లూవ్. ఇదీ—ఈ కడ్డీ.

మర్డర్ వెపన్. ఇప్పుడు విను. ఆ వ్యక్తి కంపలో కంత చేసుకుని నువ్వు బావి దగ్గర కెళ్ళగానే కంతలోంచి బైటకొచ్చి చింతచెట్టు వెనక దాక్కున్నాడు—చేతులో ఇనుపకడ్డీ పట్టుకుని దాన్ని వాడే అవసరం లేక పోయింది. నువ్వు వొంగి బావిలోకి చూస్తున్నావు. కడ్డీని అలా పడేసి, నిన్ను వొక్కతోపు తోశాడు. వెనకనుండి నువ్వు పడగానే తెచ్చిన ఉత్తరం నీ కోటుజేబులో పెట్టి ఉడాయించాడు మళ్ళా కంతగుండానే. అతను వెళ్ళగానే—ఆమె వొచ్చింది-వనకన్య. కాని ఒక్కటే సందేహం; బావి దగ్గర వుండవలసిన ఇనపకడ్డీ, కాస్తంత దూరంగా వున్న చింత

చెట్టు వెనక ఎందుకు పడివుందా అన్న సందేహం. కంతలోంచి దూరి వెడుతూ అది చేతులో వుండగా ఎవరన్నా చూస్తే ప్రమాదమని భయపడి అక్కడ పడేసి పోయాడా? రిమెంబర్—అతను వెళ్ళగానే ఆమె వచ్చింది. ఆమె రావడం గమనించే వుంటాడు హంతకుడు" అని కనుబొమ్మలు ఎగరేస్తూ, చేతులు తిప్పలు తిప్పుతూ, కంతలోంచి దూరిన విధంచేసి చూపుతూ తన సిద్ధాంతాన్ని యాకరువు పెట్టాడు ఇనస్పెక్టర్ భూషణం.

"ఉస్ మెల్లగా. ఇప్పుడు ఎవ్వరూ హత్య కాబడలేదుగా. కాబట్టి హంతకుడనటానికి వీల్లేదు. డిటెక్టివ్ నవల్స్ చదివి, ఊహాగానాలు చేస్తున్నావు" అన్నాడు సుదర్శనం.

నాకు తెలుసు; ఋజువు దొరికేవరకూ నువ్వు నమ్మవని. ఈ కడ్డీ మీద హంతకుడి వేలుముద్ర ఉంటుంది. దీన్ని ఉత్తరం మీద వున్న వేలుముద్రనీ పోల్చి చూస్తే, అవి వొకటవుతే, నా థీరీ నిజమైనట్లు. సరేనా; రేపే పట్నం పంపుతా వీటిని. ఎటొచ్చీ. ఏ కారణంవల్ల హత్యకి తెగించాడో తెలీడంలేదు What is motive? ఓ వేళ ఆ వనకన్యే హత్యకి పూనుకుందా? అవుతే ఎందుకు? తర్వాత చెప్తాను.

తనతో వాళ్ళ వూరు రమ్మన్నాడు సుదర్శనాన్ని. డాక్టరుగారు ఊళ్ళోకొచ్చాక, వొస్తాలే అన్నాడు సుదర్శనం. భూషణం మోటారు సైకిల్‌మీద తన వూరు వెళ్ళిపొయ్యాడు.

* * *

డాక్టర్‌గారొచ్చాక, తమ్ముళ్ళని స్కూళ్ళల్లో చేర్పించేటందుకు, ఇంటికి వెళ్లాలని, రెండు మూడు వారాలు శెలవడిగి వాళ్ళ వూరు వెళ్ళాడు సుదర్శనం. అక్కడ వున్న రోజుల్లో బావి వెంపు వెళ్ళలేదు. ఆమెను చూడనూలేదు. ఇంటి దగ్గర పన్లు పూర్తిచేసుకుని తిరిగి పనిలోకి చేరగానే తనకి స్కాలర్‌షిప్ వొచ్చిన వార్తొచ్చింది. ప్రెసిడెంట్ భద్రయ్యగారి

ప్రయత్నంపైన. పై చదువు కెడుతున్నానని డాక్టర్ దగ్గర శలవుతీసుగుని మళ్ళా యింటికి ప్రయాణం అయ్యాడు సుదర్శనం. వెడుతూ భూషణాన్ని చూద్దామనుకుని ఆ ఊళ్ళో దిగాడు. కాని భూషణం పట్నం వెళ్ళాడన్నారు.

*　*　*

సుదర్శనం కాలేజీలో చేరిన మూడు నెల్లకి భూషణం దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. తన సిద్ధాంతాన్ని విపులీకరిస్తూ వ్రాసిన భాగాలు కొన్ని: హంతకుణ్ణి "ఎక్స్" అందాం. నువ్వు రోజూ బావిదగ్గర కెళ్ళడం. ఆమెతో మాట్లాడడం గమనించాడు. ఎక్కడిదో పా కార్ స్టార్టర్ కడ్డీ తెచ్చి, కంతచేసుగుని, దూరి చింతచెట్టు వెనక్కి వొచ్చాడు. నువ్వు అటూ యిటూ పచార్లు చేస్తున్నప్పుడు చెట్టు మొదల్లో కొమ్మమీద కెక్కాడు. నువ్వు బావిలోకి తొంగి చూసే క్షణం రాగానే, ఇనపకడ్డీని చెట్టుకొమ్మ మొగలో కొమ్మమీద ఉంచేసి, గబ గబ బావిదగ్గర కొచ్చాడు. చెట్టుకొమ్మ మీద నిలబెట్టిన కడ్డీ. సరిగ్గా ఆనక కాబోలు, కింద రాళ్ళమీద పడింది. నువ్వు విన్న చప్పుడు అది. అతను నిన్ను తోసేసి, తెచ్చిన ఉత్తరం నీ కోటుజేబులో పడేసి చింతచెట్టు దగ్గరకొచ్చాడు. కొమ్మమీద వుంచిన కడ్డీ కనబడలేదు. ఇంతలో ఆమె రావడం చూశాడు. కడ్డీని వెదికే వ్యవధి లేదు. కంప కంతలోంచి దూరి వొచ్చేశాడు. కడ్డీమీద వేలుముద్ర స్పష్టంగా రాలేదు. ఫోటోలో, ఆ రోజున హడావిడిలో చెప్పడం మరిచాను. బావి దిగువలో కొమ్మల నడుమ ఇరుక్కున్న అగ్గిపెట్టెని పైకి తీశాను. మోగించి చూస్తే చప్పుడవలేదు. ఖాళీదనుకున్నాను; ఇంటికొచ్చాక తీసి చూశాను. అందులో రెండు పుల్ల లున్నాయి. మూలగా అట్టకింద పడి అవి చప్పుడు కాలేదు.

అగ్గిపెట్టెలో రెండు రూపాయల నోట్లున్నాయి. అప్పుడు తెలుసుకున్నాను. "ఎక్స్" ఎవరో. నువ్వు గ్రహించే ఉంటావు అతనెవరో.

జ్ఞాపకం వుందా కామందు కిష్టయ్యగారి మతిమరపు కథ—వనకన్య చెప్పిందిగా—జ్ఞాపకం చేసుకోడానికి అగ్గిపెట్టెల్లో నోట్లు పెట్టే అలవాటుం దని చెప్పింది. నిన్ను బావిలోకి తోసినప్పుడు తనూ కాస్త వొంగి వుంటాడు. ఆ వొంగినప్పుడు, అతని జేబులో అగ్గిపెట్టె బావిలోపడి, తీగల నడుమ చిక్కుకుంది. ఈ అలవాటే అతని కొంప తీసింది. అగ్గిపెట్టె మీద వేలుముద్ర ఉత్తరంపైన వేలుముద్రా ఒకటేనని ఫోటోలు నిర్ధారణ చేశాయి. కిష్టయ్య మా ఊరొచ్చినప్పుడు కరణంగారింట్లో కలిశాను. కబుర్లలో పెట్టి వారి అడ్రస్ వ్రాసి ఇమ్మని నా కలం ఆయన చేతికిచ్చి వ్రాయమన్నాను. ఆ కలం పైన వేలుముద్ర ఈ వేలుముద్ర వొకరిదే దస్తూరి కూడా కొంత ఆయనదేనని తేలిపోయింది. ఇదంతా నేను పట్నం వెళ్ళాక శోధించి, నిర్ధారణ చేసుకున్నాను.

హత్యకు కారణంకూడా తెలుస్తూనే వుంది. వనకన్యకి మూడో మాసం. తనింట్లో పని మానేసింది. బైట యాగీచేస్తుంది. నువ్వూ ఆ అమ్మాయి ఊరవతల కలుసుకోడం గమనించాడు. ఉత్తరం వ్రాసి హత్య చేస్తే వనకన్య పట్ల నువ్వు చేసిన అపచారానికి తలవొంపు భరించలేక, నలుగురికీ తెలిసి అల్లరవుతుందని ఆత్మహత్య చేసుగున్నట్లు పుట్టిస్తే, తనకే భయమూ వుండదు; అందుకని ఆ ఉత్తరం. ప్రతి హంతకుడూ ఏదో ఒక్క పొరబాటన్నా చేసితీరతాడంటారు. ఆ వ్యక్తి శీలం ముద్ర, హత్యతంతుపైన పడి తీరుతుందిట. కిష్టయ్యకి మతి మరుపు జాస్తి. ఆ ఉత్తరంలో ఫలానా ఆమెని చెరచిన అపరాధానికి పరితపించి, తాను యీ ఆత్మహత్యకి వొడిగట్టినట్లు వ్రాయడం మరచిపొయ్యాడు.

వనకన్య ఇక్కడికి అగ్రికల్చరర్ ఫారమ్‌లో తోటపనికి కుదిరిందిట ఆ మధ్య చూశా. గర్భిణి చిహ్నాలేవీ కనబడలేదు. చెప్పొద్దూ. కావల్సిన ఎవిడెన్స్ దొరికింది. "ఎక్స్"ని అరెస్ట్ చేయించాలి."

*   *   *

ఈ ఉత్తరానికి సమాధానంగా సుదర్శనం వ్రాసిన జాబులో కొన్ని భాగాలు.

"నువ్వు చెప్పినవన్నీ అక్షరాలా నిజం. ఇదంతా రంగమ్మ పనిట— నాకు తర్వాత తెలిసింది. వనకన్యని తప్పించి కిష్టయ్య గారింట్లో పనికి కుదరడానికి చేసిన పన్నాగంట. ఆమెకి అంటే వనకన్యకి ఎందులో ఏం కలిసిందో, డోకులు. మూడోమాసం అనేసరికి నమ్మేసింది. నాకూ ఆమెకీ ఏదో వుందని కిష్టయ్యగారితో చెప్పింది. అప్పుడు తట్టింది ఆయనకి నన్ను చంపివేస్తే, ఆమె స్థితికి నేను కారకుణ్ణనుకుంటారు ఊళ్ళో జనం. రంగమ్మ వారింట్లో కుదిరింది. నీ పుణ్యమా అంటూ వనకన్యకి ఫారమ్‌లో పనీ దొరికింది. నేనిక్కడ క్షేమంగా వున్నాను. నీ శ్రమకి కృతజ్ఞుణ్ణి. మనం చర్య తీసుకోనక్కర్లేదు. కిష్టయ్యగారు చనిపోయినట్లు నిన్ననే జాబొచ్చింది—మా డాక్టర్ గారు వ్రాశాడు. పత్రికలవాళ్ళ భాషలో హృద్రోగానికి గురై ఆకస్మికంగా మరణించారట. కవినికాను—ఒక్క కన్నీటి బిందువు కార్చనా ! ఇంతకీ నువ్వు వ్రాశావుకాదు. వనకన్య పేరేమిటో."